## (నాటిక)

**ఇందలి పాత్రలు:**

1. కామయ్య: మధ్యతరగతి కుటుంబీకుడు వయస్సు 45
2. మురహరి: కామయ్య బావమరది .. 38
3. శోభనాద్రి: ఆ ఊళ్ళో డబ్బు, పలుకుబడి గల వ్యక్తి .. 40
4. యస్. ఐ:
5. అనసూయ: కామయ్య భార్య .. 35

సమయం: ఏదో ఒక రాత్రి పదిగంటలు దాటింది.

స్థలం: ( కామయ్య ఇల్లు. కుడి ఎడమల ద్వారాలు. మధ్యగా ఇంట్లోకి మరొక ద్వారం. గోడలమీద సినిమాతారల కాలెండర్లు. మధ్యద్వారానికి కుడి పక్కగా ఒక స్టూలు. దానిమీద రెండు పక్కచుట్టలు. పక్కనే ఒక మంచం లేవనెత్తబడి ఉంది. మంచపుకోటిమీద ఒక కండువా. ఎడమద్వారానికి లోపలివైపు ఒక చిన్న బల్ల. బల్లమీద అద్దం, దువ్వెన, స్నోసీసా, పౌడర్ టిన్ను, పూలచెండు ఉన్నాయి. అక్కడే సినిమా మాసపత్రికగూడా ఒకటి ఉంది.

మధ్యద్వారం పైభాగాన వెంకటేశ్వరస్వామి పటం. ఆ పటానికి సన్నటి పూలమాల వెయ్యబడిఉంది. మంచానికి ముందు ఒక కొయ్యకుర్చీ. కుర్చీ కిందుగా ఒక ఇత్తడి గ్లాసు పడిఉంటుంది. )

( తెర తొలగుతూండగా కుడిద్వారం లోపలినించి కామయ్య, అనసూయల నవ్వులు వినిపిస్తున్నాయి )

కామ: ( పైతుండుగుడ్డతో చేతులు తుడుచుకుంటూ వచ్చాడు. మామూలు చేతుల బనీను వేసుకొన్నాడు.) నీ ఆడబుద్ధి పోనిచ్చావుగాదు! ( లోనికి చూస్తూ, నోరు మంట ఎత్తినట్టు బాధపడుతున్నాడు.)

అన: ( తమలపాకుల్ని చిలకలుచుడుతూ వచ్చి, వస్తున్న నవ్వును బలవంతంగా, కామయ్య చూడకుండా ఆపుకునేందుకు ప్రయత్నిస్తూ ) నేనేం చేశానండీ?

కామ: కావలిసిందేదో ఒకటికి వందసార్లు అడిగి తీసుకోవాలిగాని ఇలా కూరలో కారం కుమ్మరించడం పిరికివాళ్ల లక్షణం!

అన: ఊఁ... అడిగి అడిగి నోరు పడిపోయింది!... ఇంకేం అడిగేదిలేండి!...

కామ: అందుకని నీ చేతికి పని కలిపించి ఈ విధంగా నీ కసి తీర్చుకుంటున్నావన్నమాట! ( నోరు ఎక్కువగా మంట ఎత్తినట్టుంది ) అబ్బ!...

అన: ఇదుగో, నమలండి! ( తాంబూలం అందించి ) మంట చల్లారుతుంది. నోరు ఎర్రబడుతుంది.

కామ: ( అందుకుని నములుతూ ) ముసలివాడికి నా కెందుకే ఇంకా షోకులూ, సర్దాలూను?

అన: నా కెందుకనిగాదు, మన కెందుకనండీ!

కామ: అదేమిటీ! ( కుర్చీలో కూర్చున్నాడు. )

అన: అదే... నేను కాపరానికి వచ్చినప్పటినించి వింటూనేఉన్నాగా! కాలికి వేస్తే మెడకి, మెడకి వేస్తే కాలికేగాని, సూటిగా ఎప్పుడైనా మాట్లాడిన పాపాన పోయారూ!

కామ: ( నవ్వుతూ ) అబ్బ! ఎంత అక్కస్సే నీకు!.. అయినా నీకు అనసూయ అని పేరుపెట్టిన పుణ్యాత్ముల్ని అనుకోవాలి. ఆ మహాపతివ్రత...

అన: పేరుకి నేను తలవంపులు తెస్తున్నాను! అనండి... అనండి! ( కళ్లలో నీళ్లు తిరిగాయి. కంఠం రుద్ధమయింది. ) ఇట్లా లోకుల నోళ్లలో నానమని దేవుడు నా ముఖాన రాశాడు.

కామ: ( జాలిగా ) ఇదుగో, అనసూయా!... ఇప్పుడు నేనేమన్నాను, చెప్పు... ఏదో సరదాగా... ( దగ్గిరగా వచ్చి, తన భుజంమీద ఉన్న తుండుగుడ్డతో ఆమె కళ్లు ఒత్తుతూ ) ఛీ!... ఇంతలోనే కన్నీరా?

అన: కన్నీరుగాక పన్నీరు కారుతుందా?... నేను నవ్వుతూ తిరుగుతూంటే మీకు జ్వరం పాకినట్టు ఉంటుంది! మంచి చీర కట్టుకుంటే చూడలేరు. తలనిండా పూలు పెట్టుకుంటే ఓర్వలేరు! అదేమంటే ముసలివాళ్లకి షోకులు, సరదా లెందుకని...

కామ: అన్నాను! కాని, నిన్ను కాదుగా ... నువ్వు ముసలిదానివంటే గుడ్డివాళ్లుకూడా నవ్వుతారు!

అన: ముసలివాణ్ణని చెప్పుకుంటూ కళ్లున్నవాళ్లని మీరు గుడ్డివాళ్లని చేస్తున్నారు, చాలదూ?

కామ: నిజమే సుమా!... ఎవళ్ల సంగతో ఎందుకు? కళ్లుండీ గుడ్డివాడిలా నేను బ్రతకడంలా?

అన: ( కళ్లలో కొంత కలవరం తొంగిచూసింది. దాన్ని సర్దుకునేందుకు తల మరోపక్కకి తిప్పుకున్నది. )

కామ: ( ఆమెను తను గమనిస్తున్నట్టు ఆమెకు తెలియకుండానే రెండు క్షణాలు సూటిగా ఆమె కలవరపాటు చూశాడు. వెంటనే చిరునవ్వుతో ) అది సరేగాని...

అన: ( తేరుకుని, ఏమిటన్నట్టు చూసింది.)

కామ: నా చొక్కా తీసుకురా. ఇప్పటికే చాలా పొద్దుపోయింది!

అన: ( మధ్యద్వారంగుండా లోనికి వెళ్లి, కామయ్యకు చొక్కా తెచ్చి ఇచ్చింది.)

కామ: ( చొక్కా తొడుక్కుంటూ ) అన్నట్టు... దాని పేరేమన్నావ్... ఆఁ... మొగ్గలనెక్లెసా?

అన: ( ముఖం వికసించింది. ) కాదండీ... జాలర్ నెక్లేస్ ( కుడికాలి బొటనవేలితో నేల రాస్తూ అన్నది ).

కామ: సరే... మూడోనాటికి నీ మెళ్లో ఉండక పోతే...

అన: మీ మీసం మెలేస్తారు... ( ఫకాలున నవ్వేసింది. )

కామ: ( నవ్వుతున్న అనసూయ రెండుభుజాలు పట్టుకుని, ఆవిడ కళ్ళల్లోకి చూస్తూ ) రోజు రోజుకీ నువ్వు కుర్రపిల్లవవుతున్నావే!

అన: ( ముంచుకువచ్చిన సిగ్గుతో అతని చేతులు పక్కకి నెట్టివేస్తూ ) అబ్బ!... వదల మంటూంటే... ఆవతల ఎవరన్నా!...

కామ: తొంగిచూస్తూంటారా!

అన: అది కాదండీ, బాబూ!... వస్తారేమోనని! ఏ మాటన్నా మీతో ఇదే నస!

కామ: ( గోడలమీద ఉన్న కాలెండర్లు చూస్తూ ) నిన్ను చూస్తూంటే నాకు బలే జాలేస్తూంది, అనసూయా!

( బయట ఏదో శబ్దం వినపడింది. )

అన: ( కొంచెం కంగారుగా, బయటి వాకిటివరకు వెళ్ళి చూచి వస్తూ, సూటిగా ఆమెనే చూస్తున్న కామయ్యతో ) పాలేరేమన్నా వచ్చాడేమోనని... ఏమన్నారూ ... నామీద మీకు జాలా? నిజంగా అదృష్టవంతురాల్నే!

కామ: నీ దురదృష్టం కాబట్టే ఈ ఇంటికి కోడలుగా వచ్చావు. లేకుంటే...

అన: ఊఁ... లేకుంటే?...

కామ: ( కాలెండర్లని చూపుతూ ) ఈపాటికి నువ్వూ ఆ లిస్టులో ఉండేదానివి!

అన: పోదురూ, మీది మరీ విడ్డూరం! ఏదో ఇంటికి కళగా ఉంటుందని అవి తగిలించానుగాని, మీ రిన్ని అర్థాలు తీస్తారనుకుంటే ఎప్పుడో వాటిని తీసిపారేసేదాన్ని!

కామ: ( నవ్వుతూ ) కాగితాల్ని తీసెయ్యగలవుగాని, నీ మనసులోని కోరికల్ని తోసెయ్యగలవా, చెప్పు. అంతా నీ పిచ్చిగాని!

అన: ( బాధగా చూస్తూ ) ఎందుకండీ రోజూ నన్నిలా పొడుచుకుతింటారు? మీ కంత మోజుగా ఉంటే పోయి సినిమాల్లో వేషాలు వెయ్యండి. వంటింట్లో పడి తన్నుకుంటున్న నా కెందుకు సినిమాలు, సింగినాదాలు!

కామ: "సినిమాల్లో వేషాలు వెయ్యాలంటే ఎలాంటి అర్హతలు కావాలండీ" అని నువ్వడిగిన ప్రశ్న మొన్న ఒక పత్రికలో చదవబట్టే, నీ కోరిక తీర్చుదామని అడుగుతున్నానోయ్! అంతలోనే బిగుసుకుపోతావేం?

అన: ( నాలుక కరుచుకొని ) నాయుడిగారి లక్ష్మీకాంతం అడగమంటే, ఆ ప్రశ్న పత్రికకి రాసి

పంపానండీ!. . . నా ముఖానికితోడు సినిమాల్లో వేషాలుకూడానా?

కామ: అవ్వలు అమ్మాయిలవేషాలు వెయ్యంగా లేంది అమ్మాయికి నీకేం?

అన: చాల్లెద్దురూ, మీరూ మీ సరసాలూ! ఎవరన్నా వింటే నవ్విపోతారు. . .

కామ: నవ్వులాటగాదు, అనసూయా! "ఫలానా ప్రఖ్యాత సినీనటి అనసూయ భర్త కామయ్య" అంటే అందరూ నిన్ను శ్రీమతి అనసూయా కామయ్య అని పిలుస్తూంటే నా కెంత గర్వంగా ఉంటుందో తెలుసా? మీటింగులకి, సన్మానాలకి, బహుమతులు పంచిపెట్టానికి నీతోపాటు నీ భర్తను కాబట్టి నన్నూ పిలుస్తారు! అప్పుడు నా కెంత ఖుదిగా. . .

అన: ఇంతకన్నా ఒక్కసారిగా నా గొంతు పిసికి చంపండి! బుద్ధినేరక ఆ లక్ష్మీకాంతం పోరు పడలేక పత్రికకి ఆ ప్రశ్న పంపాను. . . ( ఏడుపు వచ్చేసింది. అయినా ఆపుకున్నది) నన్నిక అటువంటి మాట లనకండీ — మీకు దణ్ణంపెడతాను.

కామ: నువ్వు రాసింది నీకోసం కాదన్న మాట! అయితే పొరపాటు నాదే! నిన్నిక ఏమీ అనను, సరేనా?. . . అయినా ముగ్గురుబిడ్డల తల్లి ఆ లక్ష్మీకాంతాని కదేం పొయ్యేకాలం!

అన: ఊళ్ళోవాళ్ళ గొడవలు మన కెందుకులెండి!... మీరేమీ అనుకోనంటే. . .

కామ: అనుకుంటే అప్పుడడుగు. .

అన: ( చిరునవ్వుతో) చాలాకాలంనించి మిమ్మల్ని ఒక మాట అడగాలని. . .

కామ: ఊఁ. . . అడుగు!

అన: అదేనండీ. . . పోనీ, బాబూ. . . ఎందుకు వచ్చినట్లు. . . మీతో ఏదన్నా చిక్కే! ( ఓరగా, ఒయ్యారంగా చూసింది కామయ్యని)

కామ: ( ఆమెదగ్గిరగా వెళ్ళి, ఆవిడ ముఖాన్ని తన రెండుచేతులమధ్య ఉంచి, గారాబం చిందిస్తూ ) ఊహూఁ...నీ మీద ఒట్టు...నే నేమీ అనుకోను. ఏం కావాలో చెప్పు. ( చేతులు భుజాలమీద వేశాడు.)

అన: ( అతని చొక్కాగుండీలు సర్దుతూ, గోముగా ) ఇందాకటినించి మీ రన్న మాటలన్నీ. . .

కామ: పిచ్చిదానా! కారం తింటేనే తీపికి రుచి పెరుగుతుంది! అప్పుడప్పుడు నిన్ను ఉడికించి ఓదార్చటంలో నాకు తృప్తి, ఆనందం ఉన్నాయి. కాస్సేపు దెబ్బలాడుకుంటాం, వెంటనే కలిసి ఆడుకుంటాం! ఈ ఇంటికి పెద్దలమైనా, పిల్లలమైనా మనమే!

అన: అదేనండీ నా బాధ! పూర్వజన్మలో ఏ కసాయి దాన్నిగా పుట్టిన ఫలితమో ఇప్పు డీ జన్మలో ఒకనలుసైనా కలగని గొడ్రాలుగా బతుకుతున్నాను! పసిబిడ్డలు పారాడని నట్టిల్లు, పచ్చిగడ్డి మొలవని బీడుతో సమానమంటారు!. . .

కామ: ( బాధపడ్డాడు ) నిజమే!. . . నాకుమాత్రం బాధ లేదంటావా! అంతా విధివిలాసం! సృష్టికి మనం కర్తలమా, చెప్పు!. . . సరే!. . . ఇందాకా ఏదో అడుగుతానన్నావ్. . .

అన: ఈ సంగతేనండి!. . ఇన్నేళ్ళు వచ్చాక నా కిక తల్లినయ్యే భాగ్యం ఎటూలేదు! అందుకని. . . అందుకని (సందేహిస్తూ) మీరు కోప్పడనంటే...

కామ: అబ్బ. . . నువ్వలా నీళ్ళు నమిలావంటే నిజంగా నాకు కోపం వస్తుంది.

అన: అయితే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి!

కామ( హాయిగా నవ్వుతూ ) నేనూ అదే అనుకుంటున్నా.

అన: ( ఆశగా) నిజంగానా?

కామ: నీలాంటి అమ్మాయి దొరికితే . . .

అన: ( సిగ్గుతో) పొండీ! . . .

కామ: పోనీ, ఒక పని చేద్దాం. మంచి ముహూర్తం చూసి మనిద్దరం మళ్ళీ పెళ్ళాడదాం! ఒక్కొక్క వేళావిశేషం, మన రెండోపెళ్ళికి తప్పక పిల్లలు పుడతారు!

అన: మీది మరీ చిన్నపిల్లల వాలకమండీ!

కామ: ( మంచంమీద ఉన్న కండువా అందుకుంటూ ) కుప్పలనూర్పిడి అయ్యాక తీరిగ్గా కూర్చుని పెళ్ళిచేసుకుందాంగాని . . . ముందు కాసిని మంచినీళ్ళియ్యి!

అన: ( లోనికి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చి అతనికి ఇచ్చింది.)

కామ: ( తాగుతున్నాడు).

అన: ఈ కొంపలో బిక్కుబిక్కుమంటూ నే నొక్కదాన్నీ ఉండలేనండీ!

# నిజాన్ని దాచలేం

## — యర్రంనేని చంద్రమౌళి

కామ: ( గ్లాసు ఆమెకు అందిస్తూ ) ఇంకెన్నాళ్ళు? నాలుగు రోజులు ఓపికపట్టు. అప్పుడిక ఇల్లు వదిలితే ఒట్టు!

అన: ఊఁ . . . పనిలేనప్పుడంతా మహా ఇంటిపట్టునే ఉన్నట్టు!

కామ: ( చొక్కాజేబు తడుముకొని) చూడు. . . ఆ చెక్కబీరువా తీసి పై అరలో కవరు ఉంది, తీసుకురా. . .

అన: కవరా!. . .

కామ: అదే. . . దానిలో డబ్బుంది. చీకటితో వచ్చి కూర్చుంటారు కూలీలు!

అన: ( చేతిలో ఉన్న గ్లాసు అక్కడే కుర్చీలో పెట్టి మధ్యద్వారంగుండా లోనికి వెళ్ళింది.)

కామ: ( మెల్లిగా ఏదో రాగంలా మూలుగుతూ బల్ల దగ్గిరికి వెళ్ళి, అద్దంలోకి చూస్తూ, పక్కనే ఉన్న దువ్వెన అందుకుని తల దువ్వుకున్నాడు. అంతలో అప్రయత్నంగా అక్కడ ఉన్న సినిమా పత్రిక చూసి దాన్ని తీసుకున్నాడు. పేజీలు తిరగవేస్తున్నాడు. అందులో ఏదో ఒక కాగితం ఉండటం చూశాడు. కాగితాన్ని తీశాడు. అందు లోని అక్షరాలు చదవబోగా )

అన: ( లోపలినించే) ఇదుగో. . . మిమ్మల్నే!

కామ: ( త్వరత్వరగా కాగితాన్ని మడిచి జేబులో ఉంచుకుంటూ, మధ్యద్వారందగ్గిరికి వచ్చి లోనికి చూస్తూ) ఏం. . . కనిపించలే!

అన: ( వస్తూ ) మళ్ళీ ఆ తాళం పడటంలేదండీ! ( కవరు కామయ్యకి ఇచ్చింది.)

కామ: ఇంతలో ఏ దొంగలు రారులే! తరవాత తాపీగా వేసుకోవచ్చు! అవతల చేలో వడ్లరాసులున్నాయి! ( బయటివాకిలి పక్కనే ఉన్న చెప్పులు తొడుక్కుంటూ ) తలుపులన్నీ భద్రంగా వేసుకో!

అన: నేనూ వస్తానండీ. . . ఒక్కదాన్ని ఉండలేను!

కామ: నువ్వూ వస్తావా! ( అదోలా నవ్వి ) ఈ ఒక్క రాత్రికీ ఉండు . . . రేపటినించి అలాగే తీసుకువెళతాను !

అన: ఏమో, బాబూ! . . . ఇంత చీకట్లో మీరు ఒక్కరూ. . .( వెంకటేశ్వరస్వామి పటాన్ని చూసి నమస్కరిస్తూ ) అన్నిటికీ ఆ తండ్రే దిక్కు! ( తనమెళ్ళో మాంగల్యాన్ని బైటికి తీసి కళ్ళకద్దు కున్నది. )

కామ: ( కళ్ళల్లో అసహ్యం, పగ ఉరకలేస్తున్నాయి ) సరే. . . వస్తా! ( దూకుడుగా వెళ్ళాడు.)

అన: ( ఒక్క క్షణం విస్తుపోయింది. కాని వెంటనే నవ్వు తెచ్చుకొని, అతను వెళ్ళినవైపు చూస్తూ ) ఎక్కడో అడివిమనిషి! ( అప్రయత్నంగా అనేసింది.)

( వంటింట్లో పళ్ళెం పడిన శబ్దం.)

అన: ( ఉలిక్కిపడి, వెంటనే తేరుకొని, బయటివాకిటి వైపు చూసి, ఒక్క నిట్టూర్పు విడిచి, వచ్చి కుర్చీకింద, మీద ఉన్న రెండు గ్లాసుల్ని తీసుకొని కుడివేపుగా వెళుతూ ) ఈ పాడుపిల్లులతో ప్రాణాలు పోతున్నాయమ్మా! ( లోనికి వెళ్ళి వెంటనే వచ్చి, నేరుగా బల్లదగ్గిరికి వెళ్ళి, అద్దంలో తన బింబాన్ని చూసుకుని రెండు మూడు క్షణాలు మురిసిపోయింది. మురిసిపోతూ ఏదో సినిమాపాట కూనిరాగంలో ఆలాపించింది. అలా ఆలాపిస్తూనే ముఖానికి పౌడరు రాసుకుంది. కాటుకతో చక్కగా కళ్ళసోగలు తీర్చిదిద్దుకుంది. అంతకుముందున్న కుంకుమబొట్టు చెరిపి, గోడమీద ఉన్న ఏదో ఒక కాలెండర్లోని సినిమాతార చిత్రాన్ని చూసి, ఆ తారకు ఉన్న బొట్టులా తనూ పెట్టుకుంది. బల్లమీద ఉన్న పూలచెండు ఒయ్యారంగా తలలో అలంకరించు కుని, ఒక పువ్వు కుడిచెవికి పైభాగాన తలలో *దూర్చింది. చేతిగాజులు చూసుకుంది. విసుగ్గా* వాటిని తీసేస్తూ, మధ్యద్వారంగుండా లోనికి వెళ్ళి, కొద్దిసేపట్లో తిరిగివచ్చింది. ఇప్పుడు

చేతులులేని రవిక తొడుక్కునిఉంది. మళ్ళీ అద్దం చేతికి తీసుకుని, అందులోకి చూస్తూ నవ్వు, దిగులు, సిగ్గు, కోపం, దుఃఖం, కనుబొమలు ఆడించటం, ఓరగా చూడటం, కిందిపెదవి పైపంటితో కొరకటంలాంటి వివిధ చేష్టల్ని తన ముఖంలో సృష్టించుకుంటుంది. ఆఖరికి ఉండబట్టలేక అద్దంలోని తన ప్రతిబింబాన్ని ముద్దుపెట్టుకుని, అద్దాన్ని బల్లమీద ఉంచి, తనకు తనే మత్తుగా తలకు మెటికలు విరుచుకున్నది. ఆ మరుక్షణమే ఏదో గుర్తుకువచ్చి, సినిమాపత్రిక తీసి పేజీలు తిరగవేసింది. ఏదో పోగొట్టుకున్నదానిలా వేగిరపడిపోయింది. బల్లమీద, కింద, ఆ చుట్టూ వెతికి మళ్ళీ పుస్తకాన్ని తీసి విదిలిస్తూ ఉండగా )

( చేతిసంచితో మురహరి వచ్చాడు.)

ముర: ( వస్తూనే) ఎవరూ లేరే!. . . తలుపులన్నీ బార్లాతీసి . . . ( అనసూయ కనపడింది ! సరేనమ్మాయ్, నువ్విక్కడే ఉన్నావా?

అన: ( నిబ్బరంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ, బలవంతంగా నవ్వేందుకు వ్యర్థప్రయత్నంచేస్తూ) నువ్వా, అన్నయ్యా! ( దగ్గిరికి వెళ్ళి, అతని చేతిలోని సంచీ తీసుకొని) ఇప్పుడేనా రావటం? రా, కూర్చో! ( మధ్యద్వారంగుండా లోనికి వెళ్ళి, సంచీ లోపలపెట్టి వచ్చి నేరుగా వంటింట్లోకి వెళ్ళి, గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి మురహరికి ఇచ్చింది.)

ముర: ( నీళ్ళు తాగి గ్లాసు ఆమెకిస్తూ) బావేడీ?

అన: ఇప్పుడే పొలంవెళ్ళా రన్నయ్యా! నీకు ఎదురు వచ్చిఉండాలే!

ముర: లేదే!. . .

అన: అమ్మా, నాన్నా. . .

ముర: ఆహా. . . అందరూ దివ్యంగా ఉన్నారు!

అన: నా మతిమండా!. . . లే, అన్నయ్యా! భోంచేసిన తరవాత మాట్లాడుకోవచ్చు! ( మురహరిని చూసిందిమొదలు చేతులులేని రవిక కనిపించకుండా ఉండేందుకు పైటతో ఒంటిని కప్పుకుంటూ జాగ్రత్తపడుతూంటుంది. కాని, అతను ఆమెను కొత్తగా చూచినట్టు ఊహిస్తూంటాడు.)

ముర: ఆ ప్రయత్నాలేమీ వద్దమ్మాయ్! అర్ధరాత్రి నిన్ను ఇబ్బందిపెట్టడం ఎందుకని వస్తూ ఏకంగా హోటల్లో తినే వచ్చా! (కొంచెం కోపంగా) సరేగాని, అనసూయా! బావకి సరే తీరుబడి లేదనుకో! నువ్వన్నా సమాధానం రాయగూడదూ? నేను మీకు జాబురాసి ఇరవై రోజులు దాటింది. అప్పటినించీ అమ్మ నా ప్రాణాలు తీస్తూందనుకో!

అన: నీకు తెలియందేముంది, అన్నయ్యా! ఒంటిగాళ్ళం! పైగా, పంటకాలం! క్షణం తీరిక ఉండి చస్తేగా? . . .

ముర: ఊఁ. . . తీరిక . . . తీరిక! ఇదొకటి నేర్చారు! ( ప్రసన్నంగా ఆమెను చూస్తూ) ఏమిటమ్మాయ్, ఎక్కడికన్నా ప్రయాణమా?

అన: అబ్బే, లేదన్నయ్యా! (తన అలంకరణ గుర్తుకు వచ్చి) అదే. . . ( నవ్వుతూ) రామమందిరంలో సతీసావిత్రి హరికథా కాలక్షేపం. . . వెళదామని...

ముర: ( ఆవిడ చేతుల్ని పరిశీలనగా చూచి ) ఏమిటే, అనసూయా, చేతులికి గాజులేవీ!

అన: ఎందుకడుగుతావులే, అన్నయ్యా! ఆ గేదెను ఏమంటూ కొన్నారో వారానికి మూడుసార్లు నా చేతులు బోసిపోతున్నాయి!. . . ఎక్కడా, అది కుదురుగా పాలు తీయనిస్తేగా! ( చాలా తెలివిగా సమాధానం ఇచ్చానన్న గర్వం కళ్ళల్లో)

ముర: సరే. . . సరే. . . ఇప్పటికే పొద్దుపోయింది. వెళ్ళిరా, అమ్మాయ్! ఉదయం మాట్లాడుకుందాం!

అన: ఇంకేం వెళ్ళేదిగాని. . . ఇంతకీ మన వనజ పెళ్ళి ఖాయమైనట్టేగ!

ముర: ఖాయమైనట్టేనా?. . . తెల్లవారితే ఖచ్చితంగా పదిరోజులుంది పెళ్ళి!

అన: అనాటికన్నా తీరిక దొరుకుతుందో లేదో. . .

ముర: ( ఆశ్చర్యం, తరవాత కొంచెం బాధగా ) అదేమిటే, అనసూయా! . . . నా కున్నదల్లా వనజ ఒక్కతే! మన రెండు కుటుంబాలకి కొడుకైనా, కూతురైనా అదే! ఇంటిఆడబడుచు నువ్వు! నీ మేనగోడలి పెళ్ళికి రావటానికి తీరిక దొరుకుతుందో లేదోనంటావా?

అన: అదికాదన్నయ్యా! . . .

ముర: ఇంకేమీ చెప్పకు!. . . నా మనస్సు ఎంత బాధపెట్టావమ్మా!

అన: ఏదో తొందరలో నోరు జారాను. క్షమించన్నయ్యా.

ముర: పిచ్చిదానా!. . . క్షమించటానికి నువ్వేం తప్పు చేశావమ్మా!

అన: అన్ని పనులూ ఆపేసి మీ బావగారూ, నేనూ తప్పక వస్తామన్నయ్యా.

ముర: బావ రెండురోజులుంది అనంగా వచ్చినా ఫరవాలేదు. నువ్వుమాత్రం రేపు ఉదయం బండికే బయలుదేరాలి!

అన: అదేమిటన్నయ్యా!

ముర: బావతో నేను చెప్పి ఒప్పిస్తాను. దగ్గిర ఉండి అన్ని పనులూ నీ చేతిమీదుగా జరిపించాలమ్మా! ఏ అన్నయ్య మాట. . .

అన: ఎన్నటికీ కాదనను! సరేనా! . . . ఉదయం ఆయన రాగానే అన్ని విషయాలు మాట్లాడుకుందాం! ( బయట ఎవరో సకిలించిన శబ్దం)

అన: ( భయంభయంగా బయటికి చూసింది.)

ముర: ( వాకిటివైపు చూస్తూ ) ఎవరమ్మాయ్ అక్కడ?

అన: ( వేగంగా వెళ్ళి, తిరిగివస్తూ) ఎవరూ లేరన్నయ్యా! అదుగో, ఆ ఎదురింట్లో ముసలాయన తెల్లవార్లూ దగ్గుతూంటాడు!

ముర: ( ఆవలిస్తూ) సరేనమ్మా!. . . కళ్ళు కూరుకు పోతున్నాయ్. . .

అన: రా అన్నయ్యా, నీకు పెరట్లో పక్క వేస్తాను. ( స్టూలుమీద ఉన్న ఒక పక్కచుట్ట తీసుకుని కుడివైపుద్వారంగుండా లోనికి వెళ్ళి కొద్ది క్షణాల తరవాత వచ్చి) వెళ్ళి పడుకో అన్నయ్యా!

ముర: ( వెళ్ళాడు.)

అన: ( ఆందోళనగా స్వామిపటాన్ని చూస్తూ 'అన్నిటికీ



నువ్వే తండ్రీ' అన్నట్టుగా నమస్కరించి, అక్కడ ఉన్న ఖాళీగ్లాసు లోనికి తీసుకువెళ్ళి, వెంటనే ఒక చిన్న సూటుకేసుతో తిరిగివచ్చి, దాన్ని బల్లమీద పెట్టి, అక్కడ ఉన్న అద్దం, దువ్వెన మొదలైన సామానంతా సూటుకేసులో సర్దుతూండగా)

శోభ: ( పిల్లిలా పొంచిపొంచి వచ్చి, బయటివాకిట తలుపు దగ్గిరగా లాగాడు. సిల్కులాల్చీ, గ్లాస్కో పంచె, కట్‌బూట్, రెండుచేతులకి కలిపి మొత్తం నాలుగు ఉంగరాలు, మెళ్ళో సన్నటి బంగారు గొలుసు, చేతిలో చిన్నతోలుసంచి, నోట్లో కాలుతున్న సిగిరెట్టు.)

అన: ( అతన్ని చూసింది. ఇద్దరూ మాటా, పలుకూ లేకుండా, కళ్ళార్పకుండా ఒకళ్ళ నొకళ్ళు చూస్తూ










నిలబడిపోయారు.)

(అదే సమయంలో ప్రేక్షకుల్లో మొదటి వరసలో కూర్చొనిఉన్న ఒక వ్యక్తి చివాలున లేచి నుంచున్నాడు. వెంటనే వెనకనున్న ప్రేక్షకుల్లో నుంచి "కూర్చో!", "కూర్చోవయ్యా!", "అడ్డంలే" అన్న కేకలు. అతను వెనక్కి తిరిగి చురచుర చూస్తూ అక్కడే కూలబడ్డాడు.)

(ఈ లోపల అనసూయ, శోభనాద్రులు అప్రయత్నంగా మెల్లిగా నడుస్తూ దగ్గిరగా వస్తూంటారు.)

శోభ: (తగ్గుస్వరంతో) కామయ్య . . .

అన: (అదే స్వరంతో) పొలం వెళ్ళారుగా . . .

శోభ: (రహస్యంగా) ఇందాకా ఎవరితో నువ్వు మాట్లాడుతున్నావ్?

అన: మా అన్నయ్య! ఇప్పుడే ఊరినించి వచ్చాడు! . . . నువ్వు బయట సకిలించినప్పుడు మా అన్నయ్య వచ్చి చూసిఉంటే ఇంకేమన్నా ఉంది!

శోభ: ఆఁ . . . వాడి ముఖం! . . . ఇంతకి ఏడీ మీ అన్నయ్య?

అన: పెరట్లో నిద్రపోతున్నాడు!

శోభ: (ఇప్పుడు మామూలు స్వరంతో) రక్షించాడు!

అన: ఇప్పుడు నా చావుకి వచ్చింది.

శోభ: ఏం?

అన: మాణిక్యంచేత నువ్వు పంపిన చీటీ మరిచిపోయి పుస్తకంలో పెట్టి ఆ బల్లమీద పెట్టాను. అది ఇప్పుడు కనిపించటంలేదు!

శోభ: ఏమైంది?

అన: ఆయన కంట పడిందేమో!

శోభ: (తేలికగా నవ్వి) ఎవరు? కామయ్యకంటా? అమ్మా! నువ్వింత అమాయికురాలి వనుకోలేదు!

అన: (అర్థంకాక, ఏమిటన్నట్టు కళ్ళతో సైగ చేసింది.)

శోభ: అందులో నే రాసింది చదువుకున్నావు గదా?

అన: (ఔనన్నట్టు తల ఆడించింది.)

శోభ: ఇకనేం? ఆమాత్రం ఊహించలేవూ? ఇంకో గంటలో మనం ఈ ఊరి పొలిమేర దాట బోతున్నాం! తెలుసా?

అన: (అర్థమైంది. ఆనందంగా) అవును! అప్పుడిక ఆయన. . .

శోభ: మీ ఆయనలాంటి కామయ్యలు కోటిమంది ఏకమైనా మన అడ్రస్ కనుక్కోలేరు! . . . త్వరగా వెళదాం! చింతతోపులో టాక్సీ ఆపివచ్చాను! పొద్దుపొడిచేసరికి మనం పట్నంలో ఉంటాం!

అన: (అతన్ని అనుమానంగా చూస్తూ) నాలుగు రోజులు పోయాక నన్ను వదిలేసి నువ్వు వచ్చేస్తే?. . .

శోభ: నామీద నీకు నమ్మకం లేదన్న మాట!

అన: లేకకాదు! ఇట్టా నమ్మించి తీసుకుపోయి, కొన్నాళ్ళకి ఆ మగవాళ్ళు ఆడవాళ్ళని వదిలేసి వెళ్ళిపోయినట్టు నేను చాలా పుస్తకాల్లో. . .

శోభ: (మందహాసం చిందిస్తూ) చదివావు! అవన్నీ పనికిమాలినవాళ్ళు రాసిన కట్టుకథలు! వాటిని నిజమని నమ్మి ఇప్పుడు నీ భవిష్యత్తు నాశనం చేసుకుంటావన్నమాట! సరే నీ యిష్టం!

(బైటికి వెళ్ళబోతాడు.)

అన: (పోబోతున్న అతని చెయ్యి పట్టుకొని ఆపి, అతని కళ్ళలోకి చిలిపిగా చూస్తూ) నన్ను నాశనం చేస్తావనుకుంటే ఆరేళ్ళ నించి నీతో స్నేహం చేసేదాన్నేనా, చెప్పు!

శోభ: వెధవది, ఆరేళ్ళు ఒక లెఖ్ఖా!. . . ఆ సినిమా ప్రపంచమే వేరు! ఆ లోకంలో అరవై ఏళ్ళు గూడా ఆరు క్షణాల్లా దొర్లిపోతాయి. తెలుసా?

అన: అయితే . . . మీ ఆవిడ. . .

శోభ: మన కెప్పటికీ అడ్డురాదు. అన్నీ తెగతెంపులు చేసుకొని, నీకోసం . . . నిన్నొక పెద్ద సినీస్టార్ని చెయ్యాలనే పట్టుదలతో సిద్దపడ్డాను!

అన: (గోముగా) అయితే ముందు నా కొక మాటివ్వాలబ్బాయ్!

శోభ: నేనే నీవాణ్ణైతే . . . వెధవది ఇక మాట లేమిటోయ్!

అన: లేచివచ్చిందని తెలిస్తే అందరు నన్ను చులకనగా చూస్తారు! అందుకని వెళ్ళగానే ముందు మనం రిజిస్టర్ పెళ్ళి చేసుకుందాం!

శోభ: నేనూ ఈ మాటే అడుగుదామనుకున్నా! అంతకంటె నాకు కావలిసిందేముంది?

అన: పోతే. . . ఆఖరి మాట! (అతని చెయ్యి పట్టుకుని వెంకటేశ్వరస్వామి పటం ఎదురుగా తీసుకువచ్చి) అదుగో, ఆ స్వామిసాక్షిగా ప్రమాణంచెయ్యి!

శోభ: (ఆమె ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ) ఏమని?

అన: ఎప్పటికీ నన్ను విడిచిపెట్టనని, సినిమాల్లో నాచేత హీరోయిన్ వేషాలు వేయిస్తానని . . . ప్రమాణంచెయ్యందే నే నిక్కడనించి కదలను!

శోభ: ప్రమాణంమీదనేగాని మనిషిమీద నమ్మకం లేదన్న మాట!

అన: నీకేం? ఎన్ని కబుర్లన్నా చెబుతావ్! గుడిలేని దేవుడు, గడపదాటిన ఆడది సమానమంటారు! గుళ్ళో ఉంటేనే రాతినైనా మొక్కుతారు!

శోభ: ఇకనేం, మన సినిమాకి నువ్వే రాయాలి కథ!

అన: రాసిపెట్టే ఉంది! అవతల మా అన్నయ్య లేస్తాడేమో!. . . త్వరగా కానివ్వు!

శోభ: ఏమిటే!

అన: అదే. . . ప్రమాణంచెయ్యి! (చెయ్యి చాచింది.)

శోభ: అలాగే! (ఆవిడచేతిలో చెయ్యివేసి) నిన్ను ఎప్పటికీ విడిచిపెట్టను! సినిమాల్లో నీచేత హీరోయిన్ వేషాలు వేయిస్తాను!. . . . సరా!

అన: (స్వామిపటానికి నమస్కరిస్తూ) అన్నిటికీ ఆ తండ్రే ఉన్నాడు.

శోభ: అన్నీ సర్దుకున్నట్టేగా!

అన: నాదేం ఆలస్యంలేదు!

శోభ: ఏదీ! ఆఖరిసారిగా మన ఊరి నీళ్ళు నీచేతో ఒక్క గ్లాసు. . .

అన: (అతన్ని చిలిపిగా చూసి, ఒయ్యారంగా లోనికి వెళ్ళి, గ్లాసుతో నీళ్ళు తెచ్చి అతనికి ఇవ్వబోయింది.)

శోభ: (చేతికి తీసుకోడు. ఆవిణ్ణే తాగించమన్నట్టుగా నోరు తెరిచాడు.)

అన: (సిగ్గుతో మెలికలు తిరుగుతూ) పసిబిడ్డ నయం! (గ్లాసు అతని నోటికి అందించింది. అదే క్షణాన [illegible] చూసి చాటుకి తప్పుకున్న కామయ్యని వీళ్ళిద్దరు గమనించరు.)

శోభ: (నీళ్ళు తాగటం పూర్తిచేసి, తన చేతిగడియారం చూసుకున్నాడు) చాలా పొద్దుపోయింది! త్వరగా సర్దుకో!

అన: నాదేముంది! అదుగో, సూటుకేసుగూడా సిద్ధంగా ఉంది! (గ్లాసుతో లోనికి వెళ్ళింది)

కామ: (వచ్చి, ఆశ్చర్యంగా) ఎవరూ? . . . శోభ[illegible]!. . . నమస్కారమండి!

శోభ: (దెబ్బతిన్నట్టు చూసి) ఆఁ... ఆఁ... నమ. . . స్కారం!. . .

కామ: తమలాంటి పెద్దలు ఇంత రాత్రిలో ఈ పేదవాడి ఇంటికి ఎన్నడూలేంది ఈవేళ రావటం. . .

శోభ: (కొనితెచ్చుకున్న నవ్వుతో) నిజంగా నీకు నూరేళ్ళు ఆయుష్షు కామయ్యా!

కామ: నే నేం పాపం చేశాను?

శోభ: అదేమిటి, కామయ్యా!

కామ: పాపీ చిరాయుః అన్నారుకేండి. అందుకని! అన్నట్టు . . . తమ రాకకి కారణం?. . .

శోభ: అదే. . . నీకు తెలియందేముంది?! మన ఊరి పంచాయితీ ఎలక్షన్లని గురించే. . . నీతో మాట్లాడదామని! నువ్వు ఇప్పుడే పొలం వెళ్లావని అమ్మాయి చెప్పింది! మాటల్లోనే వచ్చేశావ్!

అన: (చేతులు పైటకు తుడుచుకుంటూవచ్చి, సంతోషంగా) సమయానికి మీరే వచ్చారే!. . . (శోభనాద్రితో) కూర్చోండన్నయ్యా, నిలబడే ఉన్నారు!

శోభ: (ఏడవలేక నవ్వి) ఆఁ... ఫర్వాలేదు!

కామ: అలాగంటే కుదరదు! అన్నట్టు మీరు! పైగా, మీ చెల్లాయి కూర్చోమంటూంటే. . .

శోభ: (అయోమయంగా చూస్తూ కూర్చున్నాడు)

కామ: మీ పాలేరుతో కబురంపితే నేనే పరిగెత్తుకు వచ్చేవాణ్ణి! అనవసరంగా మీకు శ్రమ. . .

శోభ: శ్రమేముందీ!. . . అయినా ఇలాంటి వ్యవహారాలు మూడో చెవిన పడగూడదు!

కామ: అదీ నిజమేనండి!. . . ఇలాంటి వ్యవహారాలకి రాత్రిళ్ళే మంచి వాటం!. . . ఎలక్షన్లంటే మాటలా మరి!?

శోభ: అదీ అసలు పాయింటు!

(ఈలోపల బల్లమీద ఉన్న సూటుకేసు తీసి కింద దాచేందుకు అనసూయ ప్రయత్నిస్తూ, చివరికి ఎలాగైతేనేం సూటుకేసు బల్లకింద దాచింది. కాని అదంతా కామయ్య గమనిస్తూనే ఉన్నాడు.)

కామ: ఈ ఊరికీ, మాకూకూడా పెద్దలు! మీ మాటకి ఎదురేముంది, చెప్పండి!. . . (ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా) క్షమించండి!. . . బండికి రెండు ఎదుర్లు కొట్టవలసిన పని ఉంది!. . . రేపు నేరుగా మీ ఇంటికే వచ్చేస్తాను. అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు!

శోభ: సరే సరే! ముందా పని కానీయ్!

పండిత డి. గోపాలాచార్యులుగారి
బాల ప్రాశ
బిడ్డలకు
రుచికరమైన టానిక్కు
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
100 జి. ఎన్. రోడ్ మదరాసు 17
2







అన్ని షాపులలో అమ్మబడును
డిస్ట్రిబ్యూటర్సు :—
శ్రీనివాస మెడికల్ & ఫాన్సీ మార్టు
రేపల్లె, గుంటూరు జిల్లా.
11-42-45, రాంగోపాల్ వీధి, విజయవాడ-1;
595, పతంగె బిల్డింగ్సు, సిద్దింబజార్,
హైదరాబాద్; 12/62, మెయిన్‌రోడ్డు, వరంగల్.

కామ: ( లోనికి వెళ్ళాడు. )

( వీళ్ళిద్దరూ ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో తోచని స్థితిలో నిలబడిపోయారు. )

కామ: ( మడ్డుకత్తితో తిరిగివచ్చి నేరుగా బయటి వాకిటివరకు వెళ్ళి, స్ర్రున వెనక్కి తిరిగాడు. క్రోధం, అసహ్యంతో కళ్ళ నిప్పులు చెరుగుతున్నాయి. ) మీ రిద్దరూ యమలోకంఎప్పుడన్నా చూశారా!

( వాళ్ళిద్దరూ స్తంభించిపోయారు. )

కామ: సినిమాలోకానికి పోయే దారిలోనే ఉం దది!

శోభ: కామయ్యా!

కామ: ఏరా, ముండా!

అన: ఏమండీ!

కామ: ఆ ముండకి, ఈ ముండ తోడు! ( జేబులోనించి కాగితం తీసి చదివాడు. ) "మాణిక్యం అన్ని సంగతులు చెబుతుంది. అన్నీ సర్దుకొని సిద్ధంగా ఉండు. ఈ రాత్రికే మన ప్రయాణం." ( వాళ్ళిద్దరూ వెర్రిముఖాలతో ఒకర్ని ఒకరు చూసుకున్నారు. )

కామ: ( కాగితాన్ని నలిపి పడవేసి ) ఈ రాత్రికికాదు మీ ప్రయాణం! ఇప్పుడే! ( ఆకలిగొన్న పులిలా వాళ్ళిద్దరిమీదికీ ఒక్కసారిగా దూకాడు. వాళ్ళిద్దరూ గజగజ వణికిపోతున్నారు ) అన్నయ్య, చెల్లెమ్మలు దేవుణ్ణి తల్చుకోండి! ( కత్తి ఎత్తాడు. ప్రాణాలు పోయినంతగా వాళ్ళిద్దరు బిగుసుకుపోయారు. వెర్రిగా ఏడుస్తూ కామయ్య కాళ్ళను చుట్టేశాడు శోభనాద్రి. అనసూయ కళ్ళు గట్టిగా మూసుకున్నది. ) ఛీ!. . . మీలాంటి పిరికి వెధవల్ని చంపి లోకంలోని మగతనానికి అపకీర్తి తేలేను! మీకు శిక్ష విధించినా—దేవుడనేవాడుంటే ఆయనే విధిస్తాడు! ( కత్తిని కింద పడేశాడు. ) ఎక్కడో చావండి! మళ్ళీ నా కళ్ళబడకండి! ( వెనక్కి తిరిగి, బరువైన గుండెతో, భారంగా అడుగులు వేస్తూ బయటికి నడుస్తున్నాడు. )

అన: ( త్రుటిలో కిందపడిఉన్న కత్తి తీసి శోభనాద్రి చేతిలో ఉంచి, దాంతో కామయ్యను కొట్టమని రెచ్చగొట్టింది. )

శోభ: ( ఆలోచించకుండా, వెంటనే కత్తి కామయ్య మీదికి విసిరాడు. )

కామ: ( ఆ సమయానికి వాకిలి దాటాడు. కాని కత్తి అతనికి బలంగా తగిలింది. ) అ. . . మ్మా! ( చావుకేకమాత్రం వినిపిస్తుంది. కాని మనిషి కనిపించ నవసరంలేదు. అతని కాళ్ళు మాత్రమే ప్రేక్షకులకు కనిపిస్తున్నాయి. కొద్ది క్షణాలు కాళ్ళు తన్నుకున్నాయి. రక్తం లోనికి చిందింది. ప్రాణం పోయినట్లుంది. కాళ్ళు నీలుక్కుపోయాయి. )

( ఆ దృశ్యాన్ని చూస్తున్న వాళ్ళిద్దరు భయంతో కంపించిపోతున్నారు. )

మురః ( అప్పుడే నిద్ర లేచివచ్చి, వాకిట్లోనే నిలబడి పోయాడు బొమ్మలా. )

అన: ( కొద్దిగా తేరుకొని, సూటుకేసు తీసుకొని, శిలలా నిలబడిఉన్న శోభనాద్రిని చెయ్యి పట్టుకుని బయటి లాక్కువెడుతుండగా )

మురః ఆగండి! ( వెర్రిగా అరిచాడు. )

( వాళ్ళిద్దరు నిలబడిపోయారు. అనసూయ చేతిలోని సూట్‌కేసు జారి పడింది. )

మురః ( నేరుగా కామయ్య శవందగ్గరికి ఆవేదనతో పరుగుతీశాడు. గుండెలు అవిసిపోయేలా ఏడ్చేస్తున్నాడు ) బావా! బా ... వా!

శోభ: ( దొంగలా పొంచి, మెల్లిగా అక్కడినించి జారుకున్నాడు. )

అన: ( తనుకూడా వెళ్ళేందుకు రెండడుగులు ముందుకు వేస్తుంది. )

మురః ( అక్కడినించి లేచి అనసూయదగ్గరగా వస్తున్నాడు. ఒక్కొక్క అడుగు బరువుగా వేస్తున్నాడు. రెండుచేతులు రక్తంతో తడిసి ఉన్నాయి. అటు ఇటు చూసి ) ఏ డీ! . . . వాడేడీ!

అన: అ ... న్న. . . ( ఏడుస్తుంది )

మురః ( బలంకొద్దీ లాగి ఆవిడ చెంపమీద కొట్టాడు ) ఎవరే నీ కన్నయ్య! ఇక్కడ నువ్వు సాగిస్తున్న నీచమైన జీవితం మాకు తెలియదనుకున్నావు కదూ! కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని, పుట్టింటివాళ్ళంగనక కిక్కురు మనకుండా నోళ్ళు మూసుకున్నాం! నువ్వి లాంటి ఘాతుకురాలివని తెలిసికూడా... బావ... ( దుఃఖం ముంచుకువచ్చింది ) బావ తండ్రిలా కడుపులో పెట్టుకొన్నాడు! అలాంటి దేవుణ్ణి. . . ( కోపం రెచ్చింది ) నిన్ను నిలువునా పాతి పెట్టినా. . .

( ఇంతలో ముందు శోభనాద్రి, అతని వెనక యస్. ఐ. లోనికి వచ్చారు. )

శోభ: ( వస్తూనే ) ఇదుగో. . . ఇతనేనండీ! ( ఆశ్చర్యపోతున్న అనసూయకు కన్ను సైగ చేశాడు. ఆమె విట్చూర్చింది ఎక్కిళ్ళు పెడుతూనే )

మురః ( శోభనాద్రిని చూచి ) రేయ్! నీ కాలం మూడింది, రారా!

శోభ: విన్నారా, ఇన్స్పెక్టర్‌గారూ!

యస్. ఐ: ( మురహరితో ) ఏయ్! ఇంకా ఎందర్ని చంపుతావ్! నడువు ముందు స్టేషన్‌కి!

మురః ( ఆశ్చర్యంగా ) మీ రనేది?. . .

శోభ: అనేదేముంది! వారు కళ్ళారా చూశారు! ఏమన్నా వ్యవహారాలుంటే కోర్టుద్వారా చక్క బెట్టుకోవాలిగాని . . . ఇలా సొంతచెల్లెలి భర్తను చంపుతావటయ్యా! నువ్వు మనిషివా, రాక్షసుడివా?

అన: ( ఇప్పుడు పెద్దపెట్టున ఏడుపు మొదలు పెట్టింది. )

యస్. ఐ: ఊరుకోండమ్మా! ఊరుకోండి. . .

అన: అన్నయ్యా! వెధవ ఆస్తికోసం నా మాంగళ్యాన్ని తెంచుతావా, అన్నయ్యా! ( ఏడుస్తూ వెళ్ళి కామయ్య శవంమీద పడి ) అయ్యో! ... దిక్కులేనిదాన్ని చేసి పోయారా! ... ఏమండీ!

శోభ: ( బాధగా ) ఊరుకోమ్మా! ఊరుకో. . . అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు!

మురః ( పళ్ళు కొరుకుతూ, శోభనాద్రిమీదికి దూకుతూ ) ఒరేయ్, శోభనాద్రిగా! నీ చావు. . .

యస్. ఐ: షోర్మయ్! ( మురహరిని తన చేతిలో ఉన్నకర్రతో కొట్టి ) నడు స్టేషన్‌కి! ( బయటికి చూస్తూ ) ఏయ్, వన్‌నాట్‌త్రీ . . . టునాట్‌సిక్స్! ( బయటినించి "యస్ సర్" అన్న సమాధానం ) శవాన్ని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి తీసుకురండి! ( మురహరిని చేతికర్రతో నెట్టుతూ ) ఊ . . . నడవ్వోయ్! . . . శోభనాద్రిగారూ! ( అనసూయను చూపుతూ ) వారిని తీసుకొని మీరుగూడా స్టేషన్‌కి రావాలి!

శోభ: అలాగే, సార్!

మురః ( నెట్టుతున్న యస్. ఐ. ని ఆపుతూ ) ఇన్స్పెక్టర్‌గారూ! ఆ కత్తితో నా గుండెల్లో పొడిచినా బాధపడను. కాని నిజాన్ని దాస్తున్న ఈ హంతకుల్ని వదిలిపెడుతున్నందుకే నా బాధ అంతా! రేయ్, శోభనాద్రిగా! ఏ కత్తితో నా బావను ఆ రాక్షసి నీచేత చంపించిందో ఆ కత్తితోనే మీ ఇద్దరి ప్రాణాలుతీసి మరీ చస్తాను.. ( ఏదో గుర్తువచ్చింది ) కత్తి! ... అన్నట్టు ఇన్స్పెక్టర్‌గారూ! దయచేసి ముందు ఆ కత్తి

బిర్లా ఆలయం ఫోటో — ఎమ్. కె. రంగస్వామి అయ్యంగారు (మద్రాసు-18)



మీది వేలిముద్రలు.
( మాట పూర్తిగాకముందే "హోర్మమ్!" అన్న భయంకరమైన అరుపుతోపాటు, ఇంతకు ముందు మొదటి వరసలోనించి ఒకసారి లేచి నిలబడ్డ వ్యక్తి విపరీతమైన కోపంతో లేచి స్టేజిమీదికి వచ్చాడు. ) ఏం కూశావ్‌రా! ( అంటూ మురహరి చెంపమీద ఫెళ్లున కొట్టాడు ) ఇందాకటినించి వింటున్నాను, ఏమిటీ తెగ వాగుతున్నావ్! కత్తిమీద వేలి ముద్రలు చూడాలేం!. . . ఇదుగో, ఇన్స్‌పెక్టర్ గారూ! ఇందులో నా కేలాంటి సంబంధమూ లేదు. ( మురహరితో ) విషం కలిపిన కాఫీ నీ చెల్లెలు నా చేతి కిచ్చింది. దాన్ని మీ బావకి నే నిచ్చాను. అంతే!( యస్. ఐ. తో )అంతే సార్, ( ప్రేక్షకుల్లో కలకలం.)

యస్. ఐ: ( ఆశ్చర్యంగా ఆ వ్యక్తిని పరిశీలనగా చూస్తూ ) అసలు మీ రెవరండీ!

వ్యక్తి: ( ఇప్పుడు అన్నివైపులకూ కలయజూచి, తన తప్పు తెలుసుకున్నట్టుగా బాధపడిపోతూ ) ఆఁ. . . ఆఁ! ఇది నాటకమా!! ( అంటూ భయంతో కిందికి రాబోతున్నాడు. )

( ఇంతలో ప్రేక్షకుల్లోనించి పోలీసువిజిల్స్ వినిపించాయి. "పట్టుకోండి, పట్టుకోండి" అంటూ ఒక పోలీసు ఇన్స్‌పెక్టర్ ప్రేక్షకుల్లో నించి పరిగెత్తుకుంటూ స్టేజిదగ్గిరికి వస్తున్నాడు. దిగబోతున్న ఆ వ్యక్తిని స్టేజిమీద ఉన్న నటులు పట్టుకున్నారు. యస్. ఐ. పైకి వచ్చాడు.)

2 వ. యస్. ఐ: ( ఆ వ్యక్తితో ) ఇంతకాలానికి మీ రాడిన నాటకం బయటపడింది, నారాయణరావుగారూ!

నారా: నువ్వనేదేమిటి!

2 వ యస్. ఐ: సుబ్బరామయ్యను విషమిచ్చి మీరు, కమలమ్మ కలిసి చంపినట్టు... ఇప్పుడే... ఇన్ని వందలమంది ప్రేక్షకుల ముందు ఒప్పుకున్నారు!
( ఇంతలో ప్రేక్షకుల్లోనుంచి "పాపం, సుబ్బరామయ్యను చంపింది నారాయణ రావా?" అన్న ఆశ్చర్యంతోగూడిన మాటలు.)

2 వ యస్. ఐ: ( ప్రేక్షకులతో ) అయ్యా! క్షమించండి! మంచి రసకందాయంలో నాటకాన్ని ఆపి, మీ ఆనందానికి అంతరాయం కలిగించాను. మూడేళ్ల క్రితం సుబ్బరామయ్య చావు విషయం మీకు తెలియందిగాదు.( ప్రేక్షకుల్లో నించి"తెలుసండీ, తెలుసు" సమాధానం) అదే. . . దాన్ని ఆత్మహత్యగా ఈ నారాయణరావుగారు, సుబ్బరామయ్య భార్య కమలమ్మ కలిసి సృష్టించారు! (స్టేజిమీద ఉన్న నటులు విస్తుపోయి, ఈ హఠాత్సంఘటన చూస్తున్నారు. )

2 వ యస్. ఐ: ( నేరుగా వెళ్లి, కామయ్య పాత్రధారిని లేవదీసి తీసుకువచ్చి ) నా తరఫున, ప్రభుత్వం తరఫున మీ నాటక సమాజానికి, ఇప్పుడు నటించిన కళాకారులందరికీ ధన్యవాదాలర్పిస్తున్నాను.( అందరితో కరచాలనం చేశాడు. అనసూయ పాత్రధారిణికి నమస్కారం చేశాడు. ఆమె ప్రతి నమస్కారం చేసింది. ) ఈ శుభ సందర్భంలో ఇలాంటి యథార్థగాథను నిర్భయంగానాటకంగారాసిన రచయితను చూడాలని నా కోరిక.( ఒక పక్కనుంచి ధోవతి, లాల్చీధరించి సుమారు ముప్పై సంవత్సరాల వయస్సున్న వ్యక్తి స్టేజిమీదికి వచ్చాడు. అతను రాగానే యస్. ఐ. అతన్ని కౌగలించుకుని ) మనసారా మిమ్మల్ని అభినందిస్తున్నాను.

నారా: ( తల వాల్చేసి, సిగ్గుతో కుమిలిపోతూ నిలబడి ఉన్నాడు .)

యస్. ఐ: నారాయణరావుగారూ! నాటక గమనంలో పూర్తిగా లీనమైపోయిన మీ కళా హృదయానికి నా ధన్యవాదాలు!. తప్పుడు సాక్ష్యాలతో ప్రభుత్వాన్నీ, ప్రజల్నీ మోసగించేందుకు మీరు ప్రయత్నించినా, మీ అంతరాత్మ నిజాన్ని దాచలేకపోయింది! అన్నట్టు, ఈ నాటకం పేరుగూడా. . .

అనసూయ పాత్రధారిణి: ( నవ్వుతూ ) నిజాన్ని దాచలేం!
( ఒక్క నారాయణరావు తప్ప మిగిలినవారందరూ హాయిగా నవ్వుతున్నారు.)

2 వ యస్. ఐ: ( నారాయణరావుతో ) స్టేషన్‌కి నడవండి నారాయణరావు గారూ! ( అతన్ని తీసుకొని నేరుగా ప్రేక్షకుల్లోనించి హాలు బయటికి నడుస్తుండగా శోభనాద్రి పాత్రధారి)ప్రేక్షకమహాశయులకు ఒక విన్నపం! తలవనితలంపుగా జరిగిన ఈ సంఘటనవల్ల నాటకాన్ని ఇంతటితో ఆపివేయవలసివచ్చింది. మళ్లీ పూర్తి నాటకాన్ని త్వరలో ప్రదర్శిస్తాము. తప్పక మీరంతా వచ్చి మమ్మల్ని ఆశీర్వదించగలరని ఆశిస్తున్నాము. ( ఈలోపల యస్. ఐ. నారాయణరావు హాలు బయటికి వెళ్లిపోయారు.)

(తెర) ★

## "లకోటా" ప్రశ్నలు — **లాంగ్టన్**

